క్లుప్తంగా

సీఎంను కలిసిన వేణుగోపాల్



కమ్మర్‌పల్లి: బీసీ కులగణన చేపట్టి అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలనే తపనతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా కూడా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేసినట్లు వేణుగోపాల్‌యాదవ్ పేర్కొన్నారు.

ముప్కాల్‌లో కేజీబీవీ తనిఖీ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీని మండల ప్రత్యేకాధికారిణి స్రవంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో నరేశ్ ఆనంద్, పాఠశాల ఎస్‌వో వినోద ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో బాలకిషన్ బుధవారం తనిఖీ చేశారు. చిన్న పిల్లల బరువును, బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం స్టాకును పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలతో మంచి ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చేయూత



రుద్రూర్: మండలంలోని రాయకూర్‌లో నీటి ఎద్దడి నివారణకు మాజీ ప్రజాప్రతినిధులు తమ వంతు చేయూతను బుధవారం అందించారు. కొన్ని రోజులుగా గ్రామంలో నీటి సరఫరా సరిగా లేనందున స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జీపీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో సురేశ్‌బాబు గ్రామానికి చేరుకొని సమస్య తీవ్రతను తెలుసుకున్నారు. మండల పరిషత్‌లో నిధుల కొరత ఉందని తెలుపడంతో స్పందించిన మాజీ ఎంపీటీసీ హన్మంత్‌రావు పటేల్, మాజీ ఉప సర్పంచ్ గంగారాం బోరు మోటార్ బిగించడానికి నిధులు సమకూర్చారు. దీంతో కొంత మేర నీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బడీడు పిల్లల సర్వే

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దులో బడీడు పిల్లల సర్వేను బుధవారం నిర్వహించారు. సీఆర్పీ విజయ్ నేతృత్వంలో బడికి రాని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిలో చేర్పించారు. హెచ్‌ఎం రత్నాకర్, సీఆర్పీ విజయ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం



వర్ని: మోస్రా, చందూరు మండల కేంద్రాల్లో బుధవారం రెడ్డి సంఘం నాయకులు తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కుల చిచ్చు పెడుతున్నారని రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి ఆరోపించారు. వరంగల్ బీసీ డిక్లరేషన్ సభలో ఓసీలను అవమానపరిచే విధంగా మాట్లాడారని వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరండి

బోధన్‌టౌన్: మహిళా సంఘాల్లో మహిళలు సభ్యులుగా చేరాలని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం అందించే పథకాల్లో లబ్ధి పొందాలంటే ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళ మహిళా సంఘం గ్రూపులో సభ్యురాలిగా ఉండాలని అన్నారు. ఇందు కోసం వార్డుల వారీగా కొత్త పొదుపు సంఘాల్లో సభ్యులను చేర్పించేందుకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 4 నుంచి 15 వరకు కొనసాగుతుందన్నారు. ఆసక్తిగల వారు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా సెక్షన్‌లో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

వందశాతం వసూలయ్యేనా?

- ఆర్మూర్ మున్సిపల్‌లో ఇంటి పన్ను రూ.6.56 కోట్ల లక్ష్యం
- ఈ నెల ఐదు వరకు రూ. 3.50 కోట్లు వసూలు
- ఇంకా రూ. 3కోట్ల6లక్షల బకాయిలు



పన్ను వసూలును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో ఇంటి పన్ను వసూలు మందకొడిగా సాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వంద శాతం లక్ష్యం చేరడానికి కేవలం 54 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు 53 శాతం పన్ను వసూలు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని 36 వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి పన్ను వసూలు చేస్తున్నారు. ఆర్మూర్‌లో మొత్తం 19వేల843 ఇళ్లు, వ్యాపార దుకాణాలు ఉన్నాయి. మున్సిపల్ డిమాండ్ రూ. 6కోట్ల56లక్షల39 వేలు ఉండగా ఇప్పటి వరకు రూ. 3కోట్ల50లక్షలు వసూలు చేశారు. ఇంకా రూ.3కోట్ల6లక్షల38వేలు వసూలు కావాల్సి ఉంది. 53 శాతం ఆస్తి పన్ను వసూలు కాగా ఇంకా 47 శాతం పన్ను వసూలు చేయాల్సి ఉంది. మిగిలిన 54 రోజుల్లో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని మున్సిపల్ అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ప్రజలు ఆస్తి పన్ను చెల్లిస్తేనే ఆర్మూర్ మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. గత రెండేళ్లకు పైగా ఆస్తి పన్ను పెండింగ్‌లో ఉన్న ఇంటి యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పన్ను చెల్లించని వారిపై తగు చర్యలు తీసుకోనున్నారు. ప్రజలు తమ ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వందశాతం ఆస్తి పన్నులు వసూలు పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకుంటాం. ప్రస్తుతం ఇంటి పన్నులపైనే దృష్టి సారించాం. ప్రతి రోజు అధికారులు ఆస్తి పన్ను వసూలుకు ఇంటింటికి తిరుగుతున్నారు. ప్రజలు సహకరిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాం. – రాజు, మున్సిపల్ కమిషనర్

బోధన్‌లో రూ. 6.39 కోట్లు లక్ష్యం

- వసూలైంది రూ. 2.64 కోట్లు
- అవ్వాల్సింది రూ. 3.74 కోట్లు
- 42 శాతం పన్ను వసూలు



బోధన్‌లో పన్ను వసూలు చేస్తున్న అధికారులు

బోధన్‌టౌన్: బోధన్‌లో ఇంటి పన్ను వసూలును మున్సిపల్ అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నారు. వంద శాతం పన్ను వసూలుకు రెవెన్యూ అధికారితో పాటు బిల్ కలెక్టర్‌తో 7 బృందాలను ఏర్పాటు చేశారు. వంద శాతం లక్ష్యం చేరడానికి కేవలం 54 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. బోధన్ మున్సిపల్‌లో 38 వార్డులు, 17,500 ఇళ్లు, వెయ్యికి పైగా వ్యాపార సముదాయాలు ఉన్నాయి. లక్షకు పైగా జనాభా ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి బల్దియా ఆస్తి పన్ను రూ.6 కోట్ల39లక్షల39వేలు డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు రూ. 2కోట్ల64లక్షల5వేలు వసూలు చేశారు. ఇంకా రూ.3కోట్ల74లక్షల75వేలు వసూలు కావాల్సి ఉంది. 42 శాతం ఆస్తి పన్ను వసూలు కా గా ఇంకా 58 శాతం పన్ను వసూలు చేయాల్సి ఉంది. మిగిలిన 54 రోజుల్లో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని మున్సిపల్ అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. మున్సిపల్‌లోని అన్ని వార్డు ల్లో పన్ను వసూలు చేయాలంటు ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు తమ ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

ప్రజలు సహకరించాలి



ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక దృష్టి సారించాం. ప్రజలు ఆస్తి పన్ను చెల్లించాలంటు ప్రచార వాహనాలను ఏర్పాటు చేశాం. పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు తమ ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి సహకరించాలి.

– వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఆర్మూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాదిగ సంఘాల సభ్యులు



బాల్కొండ మండలం నాగాపూర్‌లో..



బాల్కొండ మండల కేంద్రంలో..

ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ: ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వివిధ మాదిగ సంఘాల సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. తమ 30 ఏళ్ల కలను నెరవేర్చిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బచ్చపల్లి దేవయ్య, మోతె భూమన్న, గంగాని స్వామి, టీసీ సాయన్న, డి నర్సింలు, మేతరి సాయన్న, ఎల్‌టీ కుమార్, సురేశ్ బుడగ జంగం, అంకాపూర్ భాస్కర్, గంగాధర్, మునిపల్లి సాయన్న, సునంది, నల్ల రాజన్న, రమేశ్, కందుల రాములు, సంగం ప్రభాకర్, పొన్నాల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ మండలం నాగాపూర్‌లో స్థానిక మాదిగ సంఘ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, గంగాధర్, భూమన్న, సాయన్న, ఆనంద్, అశోక్ పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో మాదిగ సంఘం సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. మాదిగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చైతన్య సదస్సు



ఆర్మూర్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ, హుస్నాబాద్ కాలనీ, మగ్దూమ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగదారుల ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు ఆహార కల్తీ, ప్లాస్టిక్ మిశ్రమాలపై అవగాహన చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. కల్తీ ఆహారంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం డివిజన్ అధ్యక్షుడు అనిల్, రాజుల రామనాథం, పెందోట అనిల్ కుమార్, వర్మ, సందు ప్రవీణ్, యాటకర్ల దేవేశ్, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

దత్తాశ్రమంలో పుష్కర కుంభాభిషేకం



వేల్పూర్: మండలంలోని అమీనాపూర్ వద్ద ఉన్న అనఘా దత్తాశ్రమంలో బుధవారం పుష్కర కుంభాభిషేకం నిర్వహించారు. అవధాని సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మహాగణపతి పూజ, ఋత్విక్ వర్ణనం, అంకురార్పన, గణపతి హవనం, చండీ పారాయణం, ఇతర పూజలు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు గోపిస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. భక్తులు, దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర

బోధన్‌రూరల్: పట్టణంలో శివమాల ధరించిన శివస్వాములు శ్రీశైలానికి బుధవారం పాదయాత్రగా బయలుదేరారు. పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గురుస్వాముల ఆశీర్వాదలు తీసుకుని పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నందిపేట్: మండలంలోని సీహెచ్ కొండూర్‌లో చౌడేశ్వరీ ఆలయంలో శత చండీయాగం కుంబాభిషేకం ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రతిష్ఠించిన విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ నెల 7న విగ్రహా ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ సామాల దేవివాస్‌గౌడ్ తెలిపారు.

శివ మాలధారణ

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం, మండలంలోని కొత్తపల్లి, మెండోరా మండలం వెల్కటూర్‌లో బుధవారం శివ దీక్ష చేపట్టిన భక్తులు శివామాల ధారణ చేపట్టారు. శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి రోజు వరకు దీక్ష కొనసాగిస్తామని దీక్షాపరులు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఎడపల్లి: మండలంలోని జాన్కంపేటలో ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ద్రవిడ ప్రబంధ పారాయణం చేపట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేణు, శ్రీరంగం కొండమాచారి, బోధన్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సీహెచ్ కిశోర్, భక్తులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌టౌన్: విద్యార్థులకు ఇచ్చిన మాటను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. పట్టణంలోని విద్యావాకస్‌లో రిపబ్లిక్ డే రోజున నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. వేడుకల్లో పాఠశాలకు చెందిన విద్యార్థిని నజ్మా భారతదేశం గొప్పతనం, వివిధ మతాలు వ్యవహరిస్తున్న తీరు, భవిష్యత్తులో వ్యవహరించాల్సిన తీరుపై వివరించింది. దీంతో ఆమె స్పీచ్ బాగుందని, ఆమె బృందానికి రూ. 1లక్ష10 వేలు ఇస్తానని బహుమతి అందిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతిని ఎమ్మెల్యే అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో మురుగు తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది బుధవారం తొలగించారు. సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'పారిశుధ్యం అధ్వానం' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని 33, 35వ వార్డుల్లో ఉన్న మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ అధికారులు సిబ్బందితో తొలగింపు పనులు చేపట్టారు. అంతేకాకుండా దుర్వాసన వస్తున్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ప్రజలు మురికి కాలువల్లో చెత్తను వేయొద్దని శానిటరి ఎస్సై గజానాన్ సూచించారు.

సాక్షి ఎఫెక్ట్..

సన్మానం..

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



ఆర్మూర్‌టౌన్/ బోధన్‌టౌన్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దినేశ్ కులాచారిని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, నాయకులు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గంగోనె సంతోష్, పాలెపు రాజు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారిని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



బాల్కొండ: ముప్కాల్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన గజానన్‌ను మండల రేషన్ డీలర్లు బుధవారం ఘనంగా సన్మానించారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి, సభ్యులు నర్సింగ్‌దాస్, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మోర్తాడ్: గాంధీభవన్‌లో నిజామాబాద్ జిల్లా మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రూపొందించిన క్యాలెండర్‌ను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమాచారం

28న జాతీయ సైన్స్ దినోత్సవం



నవీపేట: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కోయేడి నర్సింలు బుధవారం మండల కేంద్రంలో తెలిపారు. మూఢ నమ్మకాలను నిర్మూలించాలని, విజ్ఞాన సమాజాన్ని రూపొందించాలంటే విద్యార్థుల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శ్రీరామ్ గౌడ్, లక్ష్మణ్ రాజ్, కిషన్, రాజశేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎడపల్లి: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 10న నిర్వహించే నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శాహిస్తా ఫిర్‌దౌస్ కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, జీపీ కార్యదర్శులతో నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం గురించి చర్చించారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు వారందరికి అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో మన్మోహన్‌శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీలో రక్తదానం



బోధన్‌టౌన్: ఆరోగ్యజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నిర్వహించిన మహారక్తదాన శిబిరంలో 192 మంది 192 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆరోగ్య జ్యోతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	స్కై ఫోర్స్ (హిందీ) - 10.25, 9.50 డాకు మహారాజు - 1.10, 6.45 మహిష (తెలుగు) - 4.15
స్క్రీన్-2 –	సంక్రాంతికి వస్తున్నాం - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-3–	పట్టుదల (తెలుగు) -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-4	సంక్రాంతికి వస్తున్నాం - 12.00, 3.00, 6.00, 9.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పట్టుదల (తెలుగు) - 10.50, 1.40, 4.30, 7.20, 10.15
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం - 11.00, 1.40, 4.40, 7.25, 10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	పట్టుదల (తెలుగు) - 10.05, 1.15, 4.25, 7.35, 10.45
స్క్రీన్-3	స్కై ఫోర్స్ (హిందీ) - 10.15 డాకు మహారాజు - 1.00, 7.20 దేవా (హిందీ) - 4.05, 10.25
స్క్రీన్ -4	దేవా (హిందీ) - 10.00, 7.10 స్కై ఫోర్స్ (హిందీ) - 1.15, 10.25 మదగజరాజ (తెలుగు) - 4.00
లలితామహల్	మదగజరాజ (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00
దేవి	పట్టుదల (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00
నటరాజ్	రాచరికం (తెలుగు) -11.00, 2.00, 6.00, 10.00
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 2.15, 6.10, 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	85,300	వెండి(కిలో)	98,000
22 క్యారెట్స్	78,717		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

సంక్షిప్తం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నందిపేట్: మండలంలోని వన్నెల్(కె), కుద్వాన్‌పూర్ గ్రామాల్లో పలువురు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షులు మందమహిపాల్, బైండ్ల ప్రశాంత్, లోక హన్మాండ్లు, ఎడ్డిగారి నిఖిల్, నంగి గంగాధర్, తుక్కన్న, తోట మహేశ్, మోహినొద్దీన్, ధర్మన్న, చిరంజీవి, యూసుఫ్, మజ్జు, అన్వర్, సమీర్, ప్రశాంత్, సాయిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎడపల్లి: మండలంలోని ఏఆర్పీ క్యాంప్‌లో బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన నీలి నరేశ్, మహేందర్ కూలీ పనుల నిమిత్తం జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మాజీ ఎంపీపీ, కుటుంబీకులు సమస్యను ఎమ్మెల్సీ కవితకు ఫోన్ ద్వారా వివరించారు. స్పందించిన కవిత వారికి ఆచూకీ కనుగొనేలా కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్, గ్రామస్తులు ఉన్నారు.

పీటీఎఫ్ సేవలు అభినందనీయం

వేల్పూర్: అమీనాపూర్‌లో పీటీఎఫ్(పార్ట్ టైం ఫ్యూన్)గా సేవలందించి పదవీ విరమణ పొందిన గంగారాం సేవలు అభినందనీయమని ఎంఈవో రేణుక అన్నారు. బుధవారం అమీనాపూర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. వృత్తి నిబద్ధత, అంకితభావం కలిగి పనిచేశారన్నారు. ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరాంగోపాల్, కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లీశ్వరి, టీచర్లు సరస్వతి, రాములు, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సునీల్‌కుమార్, రఘునాథ్, నాగవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి సంతాప సభ

నందిపేట్: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కర్నాటి యాదగిరి సంతాప సభను మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె గంగాధర్, రాజలింగం, మల్లయ్య, దేవన్న, అశోక్, విశ్వనాథ్, గంగాధర్, రాకేశ్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్/ పెర్కిట్: ఆర్మూర్ మండలం మగ్గిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొలగించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ మండల నాయకులు తహసీల్దార్, ఎంఈవో, ఎంపీడీవోలకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.